సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం । 23 । జూలై । 2024





**కాలినడకన ఐదు కిలోమీటర్లు..**

అధికారులు వాగులు దాటుతూ కాలినడకన ఐదు కిలోమీటర్లు వెళ్లి గిరిజన గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. 8లో



**మహిళలకు తోడ్పాటు..**

మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించేలా సెర్ప్, స్త్రీనిధి ద్వారా రుణ మంజూరుకు కార్యాచరణ రూపొందించారు. 8లో

**వాతావరణం**

గరిష్ఠం / కనిష్ఠం
30° / 25°

జిల్లాలో మంగళవారం వాతావరణం చల్లగానే ఉంటుంది. సాయంత్రం కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతీ సోమవారం స్వామివారిని ఈ రూపంలో అలంకరించటం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, ఆలయంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి విశాఖపట్టణం జిల్లా వేమగుంట గ్రామానికి చెందిన పువ్వాడ వెంకటలక్ష్మి రూ.50 వేల చెక్కును ఆలయ అధికారులకు అందజేశారు.

**రామయ్య హుండీ ఆదాయం రూ.1.21 కోట్లు**

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్ర స్వామి వారి దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. ఈ సందర్భంగా 40 రోజులకు గాను రూ.1,21,44,579 ఆదాయం సమకూరిందని తెలిపారు. ఇవే కాకుండా వివిధ దేశాల కరెన్సీతో పాటు 104 గ్రాముల బంగారం, 805 గ్రాముల వెండి సైతం ఉందని వెల్లడించారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులతో పాటు స్వచ్ఛంద సంస్థల బాధ్యులు పాల్గొన్నారు.

### జలవనరుల శాఖలో భారీగా బదిలీలు

ఖమ్మంఅర్బన్: జలవనరుల శాఖ ఖమ్మం సర్కిల్ పరిధిలో పెద్ద సంఖ్యలో ఉద్యోగుల బదిలీలు జరిగాయి. ఈమేరకు సీఈ విద్యాసాగర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేయగా ఉద్యోగులు నూతన స్థానాల్లో మూడు రోజుల్లోగా చేరాలని సూచించారు. ఒకేచోట నాలుగేళ్లు పనిచేసిన వారితో పాటు అనారోగ్య సమస్యలపై ఆప్షన్ ఇచ్చుకున్న వారిని బదిలీ చేసినట్లు తెలిపారు. నలుగురు సూపరింటెండెంట్లు, 15 మంది సీనియరు అసిస్టెంట్లతో పాటు పలువురికి స్థానచలనం కల్పించారు.

# గోదారి ఉగ్రరూపం





భద్రాచలం వద్ద స్నానఘట్టాలను ముంచెత్తిన గోదావరి వరద (ఇన్‌సెట్) 49 అడుగులకు చేరిన సమయాన నీటిమట్టం

**మూడో ప్రమాద హెచ్చరికకు చేరువలో నీటిమట్టం**

- రాత్రి 12 గంటలకు 50.20 అడుగులకు చేరిన వరద
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- పునరావాస శిబిరాలు సిద్ధం చేసిన అధికారులు

భద్రాచలం: భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం ప్రమాదకరంగా మారుతోంది. సోమవారం ఉదయం నుంచి మొదటి ప్రమాద హెచ్చరికతో ప్రవహించిన నీటిమట్టం.. మధ్యాహ్నం రెండు గంటలకు 48 అడుగులకు చేరుకోవడంతో భద్రాచలం ఆర్‌డీఓ దామోదర్ రావు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. అప్పటి నుంచి స్వల్పంగా పెరుగుతూ వస్తున్న వరద ప్రవాహం రాత్రి 12 గంటలకు 50.20 అడుగులకు చేరి మూడో ప్రమాద హెచ్చరిక సమీపానికి వచ్చింది. కాగా ఎగువ భాగంలో కురుస్తున్న వర్షాలతో పాటు దిగువన ఉన్న శబరి ఉప నది ప్రవాహం ఎక్కువగా ఉండటంతో మంగళవారం సైతం గోదావరి పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో భద్రాచలంలోని ముంపు కాలనీలు, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లోని ముంపు గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. వరద ప్రవాహం పెరిగి ఇళ్లను ముంచెత్తే ప్రమాదం ఉంటే సత్వరమే వారందరినీ పునరావాస శిబిరాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. శిబిరాల్లో బఫర్ స్టాక్‌తో పాటు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఆర్‌డీఓ దామోదర్ రావు రెవెన్యూ సిబ్బందిని నిరంతరం అప్రమత్తం చేస్తూ సలహాలు, సూచనలను అందజేస్తున్నారు.

**ముంపు గ్రామాలకు రాకపోకలు జటిలం..**

గోదావరి ప్రవాహంతో రెండు రోజులుగా దుమ్ముగూడెం, చర్ల మండలాల్లోని కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోగా సోమవారం ఆ సంఖ్య మరింతగా పెరిగింది. పర్ణశాల పుణ్యక్షేత్రంలోని సబ్‌స్టేషన్ వద్ద రోడ్డుపైకి నీరు చేరడంతో పర్ణశాలకు రాకపోకలు స్తంభించాయి. సున్నంబట్టి, బైరాగులపాడు నడుమ రాకపోకలు సైతం నిలిచిపోయాయి. మూడో ప్రమాద హెచ్చరిక దాటితే భద్రాచలం నుంచి దుమ్ముగూడెం, చర్ల మండలాల నడుమ పలు చోట్ల ప్రధాన రహదారులపైకి నీరు చేరే అవకాశం ఉంది. కాగా తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని విలీన మండలాలకు, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు సైతం రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. చర్ల మండలంలోని తాలిపేరు నుంచి వరద నీటిని గత మూడు రోజులుగా నిరంతరాయంగా గోదావరిలోకి వదులుతూనే ఉన్నారు. ప్రాజెక్టుకు చెందిన 25 గేట్లు ఎత్తి సగటున 43 వేల క్యూసెక్కులకు పైగానే నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు.

**భయాందోళనలో తీరప్రాంత ప్రజలు**

చర్ల: గోదావరి వరద ఉధృతి క్రమంగా పెరుగుతుండడంతో తీర ప్రాంత గ్రామాల ప్రజలు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. ఏటా వర్షాకాలంలో ఇదే పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తోందని అంటున్నారు. వరద ఉధృతి కారణంగా మండలంలోని కుదునూరు, దేవరాపల్లి, తేగడ, గుంపెన్నగూడెం, దండుపేట, లింగాపురం, కొత్తపల్లి, జీపీ పల్లి, వీరాపురం, చింతకుంట తదితర గ్రామాల్లోకి నీరు చేరుతుండడంతో భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే తేగడ గ్రామంలోని రెండు కుటుంబాలను అధికారులు పునరావాస కేంద్రానికి తరలించారు.

**ట్రెండ్ మారిన నదీ ప్రవాహం..**

ప్రతీ ఏడాది ముంపు ప్రాంత ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేసే గోదావరి గత సంవత్సరం ఒక్కసారి మాత్రమే మూడో ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహించింది. 2022 జూలై 16న గోదావరి చరిత్రలోనే రెండో అతి పెద్ద ప్రవాహంగా 71.3 అడుగులతో ఉగ్రరూపాన్ని చూపించింది. 2023 జూలై 29న 56.1 అడుగులుగా నమోదైంది. గతేడాది ఇదే అత్యధికం. ఇక ఈ సంవత్సరం మళ్లీ 50 అడుగులకు పైగా గోదావరి ప్రవహిస్తోంది. ఇప్పటి వరకు గోదావరి ప్రవాహాలు అత్యధికంగా ఆగస్టు నెలలోనే సంభవించగా, గత మూడేళ్లుగా జూలైలోనే అత్యధికంగా ప్రవహిస్తూ ట్రెండ్ మార్చింది.



వరద ప్రవాహాన్ని అంచనా వేసేందుకు నదిలో పర్యటిస్తున్న సీడబ్ల్యూసీ అధికారులు

### గోదావరి సందర్శన నిషేధం

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం వద్ద గోదావరి వరద ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నది సందర్శనను తాత్కాలికంగా నిలిపివేసినట్లు గ్రామ పంచాయతీ అధికారులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. కరకట్ట ప్రాంతంతో పాటు రామాలయ పరిసరాల్లో భక్తులకు అవగాహన కల్పించేలా విస్తృత ప్రచారం చేశారు. కాగా, పోలీసులు కూడా కరకట్టపైకి రాకుండా సందర్శకులను నిలిపివేస్తున్నారు.



కరకట్టపైకి రాకుండా సందర్శకులను నిలిపేస్తున్న పోలీసులు

# బాధితులకు అండగా ఉంటాం



భద్రాచలం : సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన కలెక్టర్ పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, తెల్లం వెంకట్రావు, పీఓ రాహుల్ తదితరులు

- బురదలో నడుచుకుంటూ వెళ్లి ఓదార్చిన మంత్రి పొంగులేటి
- ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు హామీ.. ట్రస్ట్ ద్వారా సాయం అందజేత
- అశ్వారావుపేట, బూర్గంపాడు, భద్రాచలంలో పర్యటన

బూర్గంపాడు/అశ్వారావుపేట/అశ్వారావుపేటరూరల్/భద్రాచలం : గోదావరి వరద ముంపు ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. వరద బాధితులు అధైర్య పడొద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సోమవారం ఆయన భద్రాచలంతో పాటు అశ్వారావుపేట, బూర్గంపాడు మండలాల్లో పర్యటించారు. అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లిలో బురదలో నడుచుకుంటూ వెళ్లి ముంపునకు గురైన ఇళ్లు, ఇసుక మేట వేసిన పొలాలు, దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వరద విపత్తును ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ముంపు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని, ఆయా కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని అన్నారు. పెద్దవాగు ప్రాజెక్టు బాధితులు మంత్రి ఎదుట తమ గోడు వెలిబుచ్చగా బాధితులందరికీ అండగా ఉంటామని, రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తమకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని పలువురు మహిళలు కోరగా, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా బాధితులకు బియ్యం, నిత్యావసరాలతో పాటు పొంగులేటి స్వరాజ్యం – రాఘవరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున నగదు అందజేశారు. మిగిలిన కుటుంబాలకు కూడా ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తామని చెప్పడంతో బాధితులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఆ తర్వాత మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. వరదలో చిక్కుకుపోయిన 41 మందిని సురక్షితంగా కాపాడేందుకు ఏపీ అధికారులతో చర్చించి హెలీకాప్టర్లను వినియోగించామన్నారు. 400 ఎకరాల్లో కొట్టుకుపోయిన పంటలకు, ఇసుక మేటలు తొలగించేందుకు రైతులకు పరిహారం సిద్ధంగా ఉందన్నారు. ఇసుక మేటల తొలగింపునకు ఎకరాకు రూ.10 వేలు, దెబ్బతిన్న పంటలు తిరిగి సాగు చేసుకునేందుకు ఉచితంగా విత్తనాలు అందిస్తామని తెలిపారు. కొట్టుకుపోయిన ఒక్కో గొర్రెకు రూ.3వేలు, పశువుకు రూ. 20వేలు చెల్లిస్తామన్నారు. కొత్తూరు గ్రామానికి చెందిన చాపర్ల వేణుమురళి మూడు రోజుల క్రితం తాగునీటి పథకం మోటార్ ఆన్ చేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు.



బాధిత కుటుంబానికి సాయం అందిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

**24 గంటలూ విధుల్లో ఉండాలి..**

భద్రాచలం వద్ద గోదావరి మూడో ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహించే అవకాశం ఉన్నందున ముంపు ప్రాంత ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. భద్రాచలంలో అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ.. ముంపు ప్రజల సంరక్షణ బాధ్యత ప్రభుత్వానిదేనని, అందుకు తగినట్లుగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. విధుల్లో అలసత్వం వహిస్తే ఎవరిపైనా చర్యలకు వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. వ్యాధులు ప్రబలకుండా క్లోరినేషన్, బ్లీచింగ్ చల్లించాలని, వైద్య సిబ్బంది పునరావాస శిబిరాల్లో అందుబాటులో ఉండాలని అన్నారు. గర్భిణులను ముందుగానే గుర్తించి సమీప పీహెచ్‌సీలకు తరలించాలని, ఉపాధ్యాయులు పాఠశాలల్లోనే ఉండాలని చెప్పారు. వరదల కాలం ముగిసే సెప్టెంబర్ వరకు అధికారులు, సిబ్బంది సెలవు పెట్టకుండా స్థానికంగానే అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీఓ రాహుల్, ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, తెల్లం వెంకట్రావు, ఆర్డీఓలు దామోదర్‌రావు, మధు, ఇరిగేషన్ సీఈలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, ట్రాన్స్‌కో ఎస్ఈ భీకంసింగ్, ఏఎస్పీ అంకిత్, తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీఓ జమలారెడ్డి, డీఈ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అలంకారప్రాయమేనా?

- పనిచేయని ప్రవాహ నమోదు పరికరాలు
- పెద్దవాగు ప్రాజెక్టుకు గండితో తెరపైకి..

అశ్వారావుపేటరూరల్ : మండలంలోని గుమ్మడవల్లి వద్ద గల పెద్దవాగు ప్రాజెక్టుకు గండ్లు పడిన ఘటనలో నీటి పారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యంతోపాటు, అత్యాధునిక టెక్నాలజీతో ఏర్పాటు చేసిన వాగు ప్రవాహ నమోదు పరికరాల పాపం కూడా ఉందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రాంత వాసుల తాగు, సాగునీటి అవసరాలకు తగ్గట్టుగా 1975లో పెద్దవాగుపై ప్రాజెక్టు నిర్మించారు. 6.3 మీటర్ల ఎత్తు, 0.6 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో.. అశ్వారావుపేట, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని 16వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేలా రూ.3 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఘన చరిత్ర గల ఈ ప్రాజెక్టుకు 1989లో కూడా నీటి పారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యంతో గండ్లు పడ్డాయి. దీంతో ప్రాజెక్టు దిగువ ప్రాంతంలోని గుమ్మడవల్లి, కొత్తూరు, వేలేరుపాడు మండలంలోని మరో 12 గ్రామాలు కొట్టుకుపోయాయి. నాడు కూడా ప్రాణనష్టం లేకున్నా వందల కుటుంబాలు సర్వస్వం కోల్పోయి వీధిన పడ్డాయి. కొన్ని కుటుంబాల వారైతే ప్రాజెక్టు కట్టకు భయపడి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు.



పెద్దవాగు ప్రాజెక్టు మినీ ట్యాంకుపై అమర్చిన పరికరం

**రూ.లక్షల ఖర్చుతో పరికరాలు..**

వర్షాకాలంలో నీటి ప్రవాహ పరిస్థితిని తెలుసుకునేందుకు నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో ఏడాదిన్నర క్రితం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నదులు, ప్రధాన వాగులు, ప్రాజెక్టుల వద్ద ప్రవాహ నమోదు పరికరాలు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో గుమ్మడవల్లి వద్దగల పెద్దవాగు ప్రాజెక్టు వద్ద సుమారు రూ. 5లక్షలతో వీటిని అమర్చారు. అంతే కాక గుమ్మడవల్లి – వడ్డెర రంగాపురం మధ్య ప్రవహించే పెద్దవాగు, కుడుములపాడు వద్ద ప్రవహించే గుండేటి వాగుతోపాటు జిల్లాలోని ముఖ్యమైన చోట్ల కూడా ఈ పరికరాలను అత్యాధునిక టెక్నాలజీతో తయారుచేయగా, వాటికి అనుసంధానంగా సీసీ కెమెరాలు సైతం బిగించారు. ఈ పరికరాల్లో నదులు, వాగుల వద్ద వరద ప్రవాహం, ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లో గుర్తించేలా ఆటోమేటిక్ వాటర్ లెవల్ రికార్డర్ ఉంటుంది. తద్వారా ప్రమాదకరంగా వరద ప్రవహిస్తే ముందుగానే గుర్తిస్తుంది. ఇలా గుర్తించి.. దీనికి అనుసంధానంగా ఉండే ప్రధాన కార్యాలయానికి హెచ్చరికలు పంపిస్తుంది. దీంతో నీటి పారుదల శాఖ అప్రమత్తమై ప్రమాదాల నివారణకు కృషిచేయాల్సి ఉంటుంది. అయితే ఈ పరికరాలు ఏర్పాటు చేసి ఏడాదిన్నర దాటుతున్నా ఇన్‌స్టాల్ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో పని చేయడం లేదు. దీంతో ఎంతో ప్రయోజనకరమైన ఈ పరికరాలు అలంకారప్రాయంగానే మారాయి. వీటిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చి ఉంటే ఇటీవల పెద్దవాగు ప్రాజెక్టుకు వచ్చిన ప్రమాదాన్ని ముందే పసిగట్టి ఉండేదని పలువురు అంటున్నారు.

# మీనం.. సిద్ధం

- జిల్లాలో 1.76 కోట్ల చేపపిల్లల పంపిణీ లక్ష్యం
- 734 చెరువుల్లో పోసేందుకు కసరత్తు
- శీలావతి, బంగారుతీగ, బొచ్చె తదితర రకాల ఎంపిక
- టెండర్ల ప్రక్రియకు నేటితో ముగియనున్న గడువు

పాల్వంచరూరల్: జిల్లావ్యాప్తంగా వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో జలాశయాలు, చెరువులు, కుంటల్లోకి నీరు చేరి జలకళ సంతరించుకుంటోంది. ఇంతలోనే చెరువుల్లో 100 శాతం సబ్సిడీపై చేపపిల్లల పంపిణీ ఈ ఏడాది ఉంటుందా, ఉండదా అన్న అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. దీంతో టెండర్ల ప్రక్రియ ప్రారంభించగా.. ఆగస్టులో చేప పిల్లల పంపిణీకి మత్స్యశాఖ కసరత్తు ప్రారంభించింది. ఈ – ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిలో చేపడుతున్న టెండర్లు మంగళవారం నాటికి పూర్తిచేయాలనే లక్ష్యంతో ఉన్నారు. ఆ తర్వాత ఎంపికైన కాంట్రాక్టర్లు ఈ నెలాఖరు లేదా ఆగస్టు మొదటి, రెండో వారాల్లో చేప పిల్లలను చెరువుల్లో వదులుతారు.

**రిజర్వాయర్లు.. చెరువులు**

జిల్లాలో తాలిపేరు, అశ్వారావుపేట మండలంలోని పెద్దవాగు జలాశయాలు ఉన్నాయి. వీటికి తోడు ఏడాది పొడవునా నీరు నిల్వ ఉండే 73 చెరువులు, కొద్దినెలల పాటు నీరు నిలిచే 661 కలిపి 734 చెరువులు చేపల పెంపకానికి అనువైనవిగా మత్స్యశాఖ గుర్తించింది. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా చేపపిల్లలను ప్రభుత్వం వందశాతం రాయితీపై అందజేయనుంది. సుమారు రూ.1.86 కోట్ల విలువైన 1,76,99,400 చేప పిల్లల పంపిణీకి మత్స్యశాఖ సన్నద్ధమైంది. ఇందులో బొచ్చె, బంగారుతీగ, శీలావతి తదితర రకాలు ఉంటాయి. కాగా, 80 నుంచి 100 మి.మీ. సైజు కలిగిన చేపపిల్లలను జలాశయాల్లో, 35 నుంచి 40 మి.మీ. సైజ్ ఉన్న వాటిని చెరువుల్లో వదలనున్నారు.

**10వేల మందికి ప్రయోజనం**

జిల్లాలో ఉచితంగా చేపపిల్లల పంపిణీ ద్వారా సుమారు 10వేల మంది మత్స్యకారులకు ప్రయోజనం కలుగుతుందని ఆ శాఖ అధికారులు గుర్తించారు. మొత్తం 70 మత్స్య పారిశ్రామిక సొసైటీలు ఉండగా ఇందులో 3,248 మంది సభ్యులు ఉన్నారు. వీరి కుటుంబాలు, ఇతర పనులు చేసే వారిని లెక్కిస్తే 10 వేల మందికి పైగా లబ్ధి చేకూరుతుందని చెబుతున్నారు. గతంలో గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో చేపపిల్లలను పంపిణీ చేసి పెంచితే వచ్చే ఆదాయంతో జీపీలకు లబ్ధి జరిగేది. గతేడాది నుంచి గ్రామ పంచాయతీల పరిధిలోని చెరువులన్నింటినీ మత్స్యశాఖకు స్వాధీనం చేశారు. దీంతో ఈ ఏడాది నుంచి పంచాయతీల చెరువుల్లో చేప పిల్లలను పోసి పెంచే బాధ్యతలు మత్స్యశాఖ అధికారులే చేపట్టనున్నారు. గతేడాది జిల్లాలోని 740 చెరువుల్లో 1,93,77,500 చేప పిల్లలను పంపిణీ చేయగా 8,824 మెట్రిక్ టన్నుల దిగుబడి నమోదైంది. ఈసారి కొన్ని చెరువులను తగ్గించడంతో చేపపిల్లల సంఖ్య సైతం తగ్గింది.



చెరువులో చేపపిల్లలు వదులుతున్న అధికారులు, మత్స్యకారులు (ఫైల్)

**దాణా కూడా ఇస్తే బాగుండేది...**

గతంలోనూ గ్రామాల్లోని చెరువుల్లో చేపపిల్లలు వదిలినా ఆశించిన సైజులో ఎదగలేదు. దీంతో సరైన దిగుబడి రాక మత్స్య సొసైటీలు, పంచాయతీలు నష్టపోయాయి. ఇందుకు ప్రధాన కారణం చేపపిల్లలకు సరైన ఆహారం(మేత) అందకపోవడమేనని తెలుస్తోంది. ప్రభుత్వం చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేస్తున్న నేపథ్యాన సబ్సిడీపై దాణా కూడా అందించాలని, తద్వారా దిగుబడి పెరిగి లాభాలు వస్తాయని మత్స్య పారిశ్రామిక సొసైటీల సభ్యులు కోరుతున్నారు.

**త్వరలోనే చేపపిల్లల పంపిణీ**



చేపపిల్లల పంపిణీకి టెండర్ల ప్రక్రియ ఈనెల 23న ముగుస్తుంది. ఆగస్టు నుంచి నిర్దేశించిన చెరువుల్లో కోటికి పైగా చేప పిల్లలను వంద శాతం సబ్సిడీపై పంపిణీ చేయనున్నాం. అయితే, రానున్న రెండు నెలలు వర్షాలు కురిసే అవకాశమున్నందున చెరువులు అలుగు పోస్తే పిల్లలు బయటకు పోకుండా వలలు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరముంది.

– వీరన్న, జిల్లా మత్స్యశాఖాధికారి

# ప్రజావాణికి తగ్గిన దరఖాస్తులు

**వర్షాలు, వరదలే కారణం**

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎడతెరిపిలేని వర్షాల కారణంగా సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి తక్కువ సంఖ్యలో ప్రజలు హాజరై దరఖాస్తులు అందజేశారు. అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులలో కొన్ని ఇలా..

- లక్ష్మీదేవిపల్లి మండలం బంగారుచెలక గ్రామానికి చెందిన బరపాటి కృష్ణ తన తల్లి నిర్మల అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తూ గత సంవత్సరం మరణించారని, ప్రభుత్వ పరంగా ఇప్పటివరకు ఎలాంటి ఆర్థిక సహాయం అందలేదని ఫిర్యాదు చేశాడు. తన భార్యకు అవకాశం కల్పించాలని కోరగా జిల్లా సంక్షేమాధికారికి ఎండార్స్ చేశారు.



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన

- తన ఇంటిముందు ఉన్న బడ్డీకొట్టు తొలగించాలని గతంలో పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని, ఇంటి మరమ్మతులకు అడ్డుగా ఉందని చెప్పినా చర్యలు తీసుకోవడం లేదని భద్రాచలానికి చెందిన అబ్దుల్ రెహమాన్ ఫిర్యాదు చేయగా తగు చర్యల నిమిత్తం భద్రాచలం తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.
- గత సంవత్సరం కేసు ఉన్న కారణంగా తనకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టా నిలిపివేశారని, రేగళ్ల గ్రామం తీర్పునకు అనుగుణంగా పట్టా పంపిణీ చేయాలని కోరుతూ లక్ష్మీదేవిపల్లి మండలం హర్యాతండాకు చెందిన ధరావత్ పులియా దరఖాస్తు అందించగా సంబంధిత శాఖాధికారులకు ఎండార్స్ చేశారు.

# కొత్త విమానాశ్రయాల నిర్మాణం చేపట్టండి

**లోక్‌సభలో కోరిన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి**

ఖమ్మంవన్‌టౌన్: ప్రస్తుతం హైదరాబాద్‌లో మాత్రమే విమానాశ్రయం ఉన్నందున రాష్ట్రంలో మరో ఆరు చోట్ల ఎయిర్‌పోర్టులు నిర్మించాల్సిన అవసరముందని ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి కోరారు. లోక్‌సభ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభం కాగా ఆయన మాట్లాడారు. భద్రాద్రి జిల్లా కొత్తగూడెం, నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి, మహబూబాబాద్ జిల్లాల్లో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాలు నిర్మించడమే కాక వరంగల్ జిల్లా మామునూరు, పెద్దపల్లి జిల్లా బాసిత్‌నగర్, ఆదిలాబాద్ జిల్లాల్లోని ఎయిర్‌పోర్ట్‌లను అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. వీటన్నింటిపై ఎయిర్‌పోర్టు అథారిటీ గతంలోనే సర్వే పూర్తిచేసిందని తెలిపారు. ఇందులో కనీసం రెండింటినీ త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి

## క్లుప్తంగా

### కిన్నెరసాని ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తివేత

11 వేల క్యూసెక్కుల నీరు గోదావరిలోకి విడుదల



మూడు గేట్ల ద్వారా దిగువకు వెళ్తున్న వరద

**పాల్వంచరూరల్:** ఎగువన కురుస్తున్న వర్షాలతో పాల్వంచ మండలం కిన్నెరసాని రిజర్వాయర్‌లోకి వరద కొనసాగుతోంది. దీంతో అధికారులు ఉదయం రెండు గేట్లు, సాయంత్రం మరో గేట్ ఎత్తి నీటిని గోదావరిలోకి దిగువకు విడుదల చేస్తున్నారు. ఈనేపథ్యాన రాజాపురం వద్ద లో లెవల్ చప్టాపై వరద ప్రవహించడంతో 24 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ఇన్నాళ్లు రాత్రివేళ మాత్రమే గేట్లు ఎత్తే అధికారులు వరద పెరగడంతో సోమవారం ఉదయమే గేట్లు ఎత్తడంతో నీరు చప్టాపై ప్రవహిస్తోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన కిన్నెరసాని రిజర్వాయర్‌లోకి 14 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో నీటిమట్టం సోమవారం 402.90 అడుగులకు చేరింది. ఈమేరకు 11వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

### హాస్టళ్లకు విజయ పాల సరఫరా ప్రారంభం

భద్రాద్రి జిల్లాలో ఖరారు కాని కాంట్రాక్టర్

**ఖమ్మంవ్యవసాయం:** ఖమ్మం జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలకు ప్రభుత్వ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య(విజయ డెయిరీ) ద్వారా పాల సరఫరా ప్రారంభమైంది. జిల్లాలోని 180 వసతి గృహాలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రస్తుతం రోజుకు 2,700 లీటర్ల పాలను ఐదు రూట్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఆదివారం నుంచి సరఫరా మొదలైందని అధికారులు తెలిపారు. అయితే, భద్రాద్రి జిల్లాలోని 212 హాస్టళ్లకు 3 వేల లీటర్లకు పాలు సరఫరా చేయాల్సి ఉండగా కాంట్రాక్టర్ ఇంకా ఖరారు కాలేదు. పలు ప్రాంతాలకు సరైన రహదారులు లేకపోవడంతో కాంట్రాక్టర్ ఎంపిక జాప్యమవుతోందని తెలిసింది.

### స్నేహితుడి స్మారకంగా హెల్మెట్ల వితరణ



హెల్మెట్లతో పూర్వ విద్యార్థులు

**అశ్వాపురం:** ఓ వ్యక్తి హెల్మెట్ ధరించకపోవడంతో రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, అతని మిత్రులు మరొకరి ప్రాణాలు అలా కోల్పోవద్దనే ఉద్దేశంతో సోమవారం హెల్మెట్లు వితరణ చేశారు. మండల పరిధిలోని మిట్టగూడెం జెడ్పీ స్కూల్‌లో 2004 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఈ కార్యక్రమం చేపట్టారు. గత నెల రోడ్డు ప్రమాదంలో తమ స్నేహితుడు ఆలం రాజు మృతి చెందాడని, అతని స్మారకంగా మిట్టగూడెం హై స్కూల్‌లో హెల్మెట్లు పంపిణీ చేశామని పేర్కొన్నారు. అనంతరం తమ గురువును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కంజర్ల వాణి, పూర్వ విద్యార్థులు అనిల్, మహేష్, రాజు, జానికిరావు, విజయ్, శ్రీను, నరేష్, మోహన్‌రెడ్డి, వరప్రకాష్, వెంకన్న, జగన్, రాజేష్, వెంకట్రావు, నరేష్, శంకర్, సాంబయ్య, అబ్దుల్‌పాషా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఆపరేషన్ ముస్కాన్ బృందం తనిఖీలు

ఇద్దరు బాల కార్మికుల గుర్తింపు

**అశ్వారావుపేటరూరల్:** కొత్తగూడెం ఆపరేషన్ ముస్కాన్ బృందం ఆధ్వర్యంలో సోమవారం అశ్వారావుపేటలోని దుకాణాలు, హోటళ్లలో తనిఖీ చేశారు. ఓ స్వీటు షాపులో 14 ఏళ్ల బాలుడు, మరో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో 16 ఏళ్ల వయసు బాలుడితో పనులు చేయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి, బాలకార్మికులను అప్పగించారు. అధికారుల ఫిర్యాదు మేరకు బాల కార్మికులతో పనులు చేయిస్తున్న దుకాణదారులు శంకర్ శ్రీనివాస బాలాజీ, సత్యవరప్రసాద్‌లపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై యాకుబ్ అలీ తెలిపారు.

### విషజ్వరంతో చిన్నారి మృతి



మృతి చెందిన చిన్నారి

**పాల్వంచరూరల్:** విషజ్వరంతో రెండేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటన ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. మండల సరిహద్దు దట్టమైన అటవీ ప్రాంతంలోని బుసురాయి గ్రామానికి చెందిన మడకం రాజు కుమార్తె దేవి(2) మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. ఉల్వనూరు పీహెచ్‌సీకి తీసుకురాగా డాక్టర్ తేజశ్రీ వైద్య పరీక్షలు నిర్వహించారు. చిన్నారికి గుండె సంబంధిత వ్యాధి ఉందని తెలపడంతో మెరుగైన వైద్యం కోసం ఈ నెల 16న కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది.

### పామాయిల్ గెలలు



| | |
|---|---|
| టన్ను ధర | రూ.13,705 |

# మహిళలకు తోడ్పాటు..

- స్త్రీ నిధి, సెర్ప్, మెప్మా ద్వారా రుణాలు అందజేత
- ఈ ఏడాది రూ.94 కోట్లు ఇచ్చేలా వార్షిక ప్రణాళిక
- ఇప్పటికే రూ. 8 కోట్ల మేర పూర్తయిన గ్రౌండింగ్



మహిళలకు పథకాలు వివరిస్తున్న సెర్ప్ సిబ్బంది (ఫైల్)

**ఇల్లెందురూరల్:** మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. వీరికి పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), స్త్రీనిధి తోడ్పాటును అందిస్తున్నాయి. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం సెర్ప్, మెప్మా, స్త్రీనిధి ద్వారా వివిధ రకాల పథకాలను అమలు చేస్తోంది. తాజాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు రూ.94 కోట్లను మంజూరు చేసింది. ఇప్పటికే రూ.8 కోట్ల రుణాలను గ్రౌండింగ్ చేయగా, ఆసక్తి కలిగి మరికొందరికి యూనిట్లు మంజూరు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

**1,652 యూనిట్లు మంజూరు**

జిల్లాకు మంజూరైన రూ.94 కోట్లతో 1,652 యూనిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో రూ.28.20 కోట్లను విద్య, ఆరోగ్యం, వ్యక్తిగత అవసరాల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.40 వేలకు మించకుండా రుణంగా అందజేస్తారు. ఇక మిగిలిన రూ.65.80 కోట్లను స్వయం ఉపాధి లక్ష్యంగా మంజూరు చేస్తారు. మొత్తం యూనిట్లలో పాడిపరిశ్రమకు 100 యూనిట్లు, మేలు జాతి గొర్రెల పెంపకం 40, పెరటి కోళ్ల పెంపకం 700, చిన్న కోడి పిల్లల పెంపకం 4, తీగజాతి కూరగాయల సాగు 40, జనరిక్ మందుల దుకాణం 4, ఇంటి మరమ్మతులు 40, టెంట్ హౌస్ 4, ఎలక్ట్రిక్ ఆటోలు 40, విద్యుత్ టూవీలర్స్ 60, సోలార్ పవర్ ప్లాంట్ 320 యూనిట్లు ఉన్నాయి.

**రుణపరిమితి ఇలా..**

యూనిట్ ఆధారంగా గరిష్ఠంగా మంజూరయ్యే నిధుల వివరాలిలా ఉన్నాయి. పాడిపరిశ్రమకు రూ.85,200, మేలు జాతి గొర్రెల పెంపకానికి రూ.73,350, పెరటి కోళ్ల పెంపకానికి రూ.12,500 నుంచి రూ.22వేల వరకు, చిన్న కోడి పిల్లల పెంపకానికి రూ.2.91 లక్షలు, తీగజాతి కూరగాయల సాగుకు రూ.లక్ష, జనరిక్ మందుల దుకాణానికి రూ.3 లక్షలు, ఇంటి మరమ్మతులకు రూ.75 వేలు, టెంట్ హౌస్‌కు రూ.4.50 లక్షలు, ఎలక్ట్రిక్ ఆటోకు రూ.3 లక్షలు, టూవీలర్లకు రూ.75వేలు, సోలార్ పవర్ ప్లాంట్ యూనిట్లు 1 కిలోవాట్‌కు రూ.70వేలు, 2 కిలోవాట్లకు 1.15 లక్షలు, 3 కిలోవాట్లకు రూ.1.60 లక్షలు చొప్పున రుణం మంజూరు చేస్తారు. మంజూరైన నిధుల ఆధారంగా 0.23 శాతం సురక్ష భీమా, 2శాతం లబ్ధిదారుల వాటాగా అసలుతో కలిపి నిర్దేశించిన వాయిదాల్లో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

**సోలార్ ప్లాంటుకు స్త్రీనిధి రుణాలు**

విద్యుత్ అవసరాలు, ఖర్చులు, భారం దృష్ట్యా స్వయం సహాయక సంఘాలు సొంతంగా సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుని ఖర్చును గణనీయంగా తగ్గించుకునేలా ప్రభుత్వం స్త్రీనిధి ద్వారా సోలార్ యూనిట్లను తొలిసారిగా మంజూరు చేస్తోంది. 160 చదరపు అడుగుల ఆర్‌సీసీ భవనం కలిగిన మహిళలు సౌర యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. ఖర్చులో రుణం 50 శాతం, రాయితీ 40 శాతం ఉంటుంది. మిగితా పదిశాతం లబ్ధిదారుల వాటాధనంగా నిర్దేశించారు. సోలార్ యూనిట్ల ఏర్పాటు ద్వారా విద్యుత్తు బిల్లుల ఖర్చు తగ్గుతుంది. మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు సరఫరా చేసుకునే అవకాశం ఉంటుంది. అందుకు ట్రాన్స్‌కో నుంచి మహిళలకు అదనంగా ఆదాయం సమకూరుతుంది.

**ఆర్థికాభివృద్ధికి అవకాశం**



మహిళల ఆర్థికాభివృద్ధికి స్త్రీనిధి రుణాలు మంచి అవకాశం. ప్రజల జీవన ప్రమాణాలలో మార్పు తెచ్చే లక్ష్యంగా యూనిట్లు నిర్ణయించారు. ప్రధానంగా సోలార్ యూనిట్లు, పాడి పరిశ్రమ, కోళ్ల పెంపకం, ఎలక్ట్రిక్ వాహనాలు, కూరగాయల సాగు వంటి యూనిట్లు మరింత మేలు చేస్తాయి.

– దేవారపు శ్యాంసుందర్, ఆర్ఎం, స్త్రీనిధి, ఖమ్మం రీజియన్

## తాలిపేరు ప్రాజెక్ట్‌కు తగ్గుతున్న వరద



ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న వరదనీరు

**చర్ల:** తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్ట్‌కు వరద ఉధృతి తగ్గుతోంది. ఎగువ నుంచి ఆదివారం రాత్రి 94,231 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, క్రమంగా తగ్గుతోంది. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు 92,121 క్యూసెక్కుల వరద ప్రవాహం ఉండగా, సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు 76,324 క్యూసెక్కులకు పడిపోయింది. 6 గంటలకు 57,013 క్యూసెక్కులు, మధ్యాహ్నం 12 గంటలకు 47,874 క్యూసెక్కులు, సాయంత్రం 6 గంటలకు 45,362 క్యూసెక్కులకు తగ్గింది. ప్రస్తుతం 25 గేట్లను పూర్తిగా ఎత్తి ఉంచి 43, 303 క్యూసెక్కుల చొప్పున వరదనీటిని దిగువన ఉన్న గోదావరి నదిలోకి విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో వర్షాలు కాస్తా తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్ట్‌లోకి వరద ఉధృతి తగ్గుతోంది. సోమవారం అర్ధరాత్రి వరకు 20 నుంచి 30 వేల క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో తగ్గుతుందని ప్రాజెక్ట్ డీఈ తిరుపతి తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 74.00 మీటర్లు కాగా, వరద ఉధృతి దృష్ట్యా 70.59 మీటర్లుగా క్రమబద్ధీకరిస్తున్నాట్లు డీఈ తెలిపారు.

## కాలినడకన ఐదు కిలోమీటర్లు..

వాగులు దాటుతూ వెళ్లిన అధికారులు, వైద్య సిబ్బంది



వాగు దాటుకుంటూ సీతారాంపురం గ్రామానికి వెళ్తున్న అధికారులు, సిబ్బంది

**పాల్వంచరూరల్ :** కాలినడకన ఐదు కిలోమీటర్ల పాటు వాగులు, చెరువులు దాటుకుంటూ వెళ్లి గిరిజన గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు అధికారులు. పాల్వంచ తహసీల్దార్ వివేక్, ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి, వైద్యాధికారి రాజు సిబ్బందితో కలిసి మండలంలోని దంతలబోరు, సీతారాంపురం తదితర ఆదివాసీ గ్రామాలకు వెళ్లి.. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాగులు పొంగితే నెలలు నిండిన గర్భిణులు ఆస్పత్రులకు వెళ్లడం కష్టమని, ముందుగానే చేరాలని అవగాహన కల్పించారు. ఈ క్రమంలో ముగ్గురు గర్భిణులను పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేయగా... ఉన్నఫళంగా తాము రాలేమని, సామగ్రి సర్దుకొని వస్తామని చెప్పడంతో అధికారులు వెనుదిరిగారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, ఆరోగ్య పర్యవేక్షకుడు కృష్ణయ్య, హెల్త్ అసిస్టెంట్‌లు నహేమియా, శ్రీనివాస్, ఆశ వర్కర్లు ఉన్నారు.

# డెంగీ విజృంభణ...

- ఖమ్మం జిల్లాలో రెండు వారాలుగా పెరుగుతున్న కేసులు
- వర్షాలకు తోడు పారిశుద్ధ్య లోపమే కారణం
- వివిధ శాఖల మధ్య సమన్వయం లేక సమస్య



ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి ఓపీ విభాగంలో పేర్ల నమోదుకు క్యూ కట్టిన జనం

**ఖమ్మంవైద్యవిభాగం:** ఖమ్మం జిల్లాలో గడిచిన రెండు వారాలుగా డెంగీ కేసులు పెరుగుతున్నాయి. కొద్దిరోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పల్లె, పట్నం తేడా లేకుండా మురుగునీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి. వీటి బారిన ప్రజలు పడుతుండడం డెంగీ కేసుల సంఖ్య పెరగటానికి కారణమవుతోందని చెబుతున్నారు. వర్షాకాలం ఆరంభంలోనే ఏటా పల్లెప్రగతి, పట్టణ ప్రగతి పేరిట పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాల్సి ఉన్నా ఈ ఏడాది ఎక్కడా దృష్టి సారించడం లేదు. జీపీల్లో పాలకవర్గాలు లేకపోవడంతో నిర్వహణ కొరవడిందని తెలుస్తోంది. దీనికి తోడు వివిధ శాఖల మధ్య సమన్వయం కొరవడడం కూడా డెంగీ కేసులు పెరగడానికి కారణమనే ప్రచారం జరుగుతోంది.

**పల్లెవాసులే బాధితులు**

ఖమ్మం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల నుంచి డెంగీ కేసులు ఎక్కువగా వస్తున్నాయని సమాచారం. గత రెండు వారాల్లో కేసుల సంఖ్య పెరిగింది. వర్షంతో నీరు నిలవడానికి తోడు పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా జరగకపోవడం దోమల వృద్ధికి కారణమవుతోంది. గడచిన రెండు వారాలుగా జిల్లాలో 16 చొప్పున డెంగీ కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 9,491 శాంపిళ్లు సేకరించగా ఈనెల 19వ తేదీ వరకు 210 డెంగీ పాజిటివ్ కేసులు వెలుగుచూశాయి. ఇందులో తిరుమలాయపాలెం పీహెచ్‌సీ పరిధిలోనే 18 కేసులు ఉంటే.. కేవలం జల్లేపల్లిలోనే 14 కేసులు నమోదు కావటం గమనార్హం. ఆ గ్రామంలో కేసులు ఎక్కువ రావడానికి పారిశుద్ధ్య లోపమే కారణమని వైద్య, ఆరోగ్య శాఖాధికారులు గుర్తించారు. అలాగే పెద్దగోపతి పీహెచ్‌సీ పరిధిలో 18 కేసులు నమోదు కాగా పెద్దమునగాలలో 12, ఎం.వీ.పాలెం పీహెచ్‌సీ పరిధిలో అత్యధికంగా 29 కేసులు, మంచుకొండ పరిధిలో 20 కేసులు ఇప్పటివరకు నమోదయ్యాయి. పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, వైద్య ఆరోగ్య శాఖల మధ్య సమన్వయం కొరవడడంతో డెంగీకి తోడు మలేరియా, చికెన్‌గున్యా, వైరల్ ఫీవర్లూ వ్యాపిస్తున్నాయి.

**పెద్దాస్పత్రికి క్యూ**

సీజనల్ వ్యాధుల ప్రభావంతో కొద్దిరోజులుగా ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వస్తున్న వారి సంఖ్య పెరిగింది. ప్రధాన ఆస్పత్రి కావటం, మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండడంతో ఎక్కువ పీహెచ్‌సీలకు వెళ్లకుండా ఇటే వస్తున్నారు. ఉదయం 8 గంటల నుండే ఓపీ వద్ద క్యూ మొదలై ఆ తర్వాత గంటగంటకు కిటకిటలాడుతోంది. ఓపీ సేవలతో పాటు ఇన్‌పేషంట్ సేవలు కూడా పెరిగి పలు వార్డుల్లో బెడ్లు నిండిపోయాయి. నిత్యం 2వేల మందికి వరకు వస్తుండగా, వీరిలో 150 నుండి 200 మంది ఇన్‌పేషంట్లు చేరుతున్నారు. ప్రస్తుతం బెడ్డుకు ఒకరే చికిత్స పొందుతున్నా సీజనల్ వ్యాధుల ఉధృతి పెరిగితే మాత్రం ఒక్కో బెడ్డుపై ఇద్దరు, ముగ్గురికి చికిత్స చేసే పరిస్థితులు ఎదురుకావొచ్చని భావిస్తున్నారు.

## వైద్య సిబ్బంది బదిలీ

**జూలూరుపాడు:** ప్రభుత్వాస్పత్రి సిబ్బంది, క్షేత్ర స్థాయి సిబ్బంది బదిలీ అయ్యారు. ప్రభుత్వాపత్రిలో 17 ఏళ్లుగా ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎస్కే హఫీజ్ ఖమ్మం మెడికల్ కళాశాలకు బదిలీ కావడంతో ఈ పోస్ట్ భర్తీ కావల్సి ఉంది. పీహెచ్‌సీ పరిధిలో సీహెచ్‌ఓగా విధులు నిర్వర్తిస్తున్న వెంకటేశ్వర్లు మధిర మండలం దెందుకూరు పీహెచ్‌సీకి బదిలీ కాగా, ఆయన స్థానంలో పాల్వంచ డిప్యూటీ డీఎంహెచ్ఓ ఆఫీస్‌లో విధులు నిర్వర్తిస్తున్న రామకృష్ణ రానున్నారు. పీహెచ్‌సీ హెచ్‌వీ సుభద్రమ్మ బదిలీపై పెనగడప పీహెచ్‌సీకి వెళ్లగా, అక్కడ పని చేస్తున్న ప్రియదర్శిని జూలూరుపాడుకు వచ్చారు. గుండెపుడి ఆరోగ్య ఉపకేంద్రంలో పని చేస్తున్న ఏఎన్ఎం రాజమ్మ రేగళ్లతండా పీహెచ్‌సీకి, జూలూరుపాడు పీహెచ్‌సీ పరిధిలోని అన్నారుపాడు హెల్త్ సబ్ సెంటర్‌లో విధులు నిర్వర్తించే ఏఎన్ఎం వెంకటముత్యం గుండెపుడికి, పడమటనర్సాపురం హెల్త్‌సబ్ సెంటర్‌లో విధులు నిర్వర్తించే ఏఎన్ఎం ఆదిలక్ష్మి అన్నారుపాడు బదిలీ అయ్యారు. ఆరేళ్లుగా కాకర్ల హెల్త్ సబ్‌సెంటర్‌లో ఫస్ట్ ఏఎన్ఎం పోస్టు ఖాళీ ఉండగా, అనంతారం హెల్త్‌సబ్ సెంటర్ ఫస్ట్ ఏఎన్ఎం సత్యాదేవి గత ఏడాదిన్నరగా అనారోగ్య కారణాలతో విధులకు హాజరు కావడంలేదు. పడమటనర్సాపురం హెల్త్ సబ్‌సెంటర్‌లో పని చేసే ఫస్ట్ ఏఎన్ఎం ఆదిలక్ష్మి అన్నారుపాడు బదిలీ కావడంతో ఇక్కడ కూడా ఏఎన్ఎం పోస్ట్ ఖాళీగా ఉంది.

## పేకాటరాయుళ్ల అరెస్ట్

**మణుగూరు టౌన్:** పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను మణుగూరు పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. మండలంలోని కూనవరం పంచాయతీలోని చంద్రబాబు నగర్ శివారు ప్రాంతంలో కొందరు పేకాట ఆడుతుండగా ఎస్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఐదుగురిని అరెస్ట్ చేసి, రూ.1,500 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

## రెండు ఆలయాల్లో చోరీ

**బూర్గంపాడు:** సారపాకలోని రెండు ఆలయాల్లో ఆదివారం రాత్రి చోరీలు జరిగాయి. సారపాక సత్యధామంలోని శ్రీసత్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి ప్రధానద్వారం తాళాలు పగులగొట్టి హుండీల్లోని నగదును దొంగలు అపహరించారు. గోదారమ్మ క్యాంపులోని ఆంజనేయస్వామి ఆలయ హుండీ తాళం పగులగొట్టి అందులోని నగదును దొంగిలించారు. సోమవారం ఉదయం పూజలు చేసేందుకు ఆలయానికి వచ్చిన అర్చకులు హుండీలు పగులగొట్టడాన్ని గమనించి ఆలయ నిర్వాహక కమిటీలకు తెలిపారు. కాగా ఈ ఘటనలపై తమకు ఫిర్యాదులు అందలేదని పోలీసులు తెలిపారు.

## పోలీస్‌స్టేషన్ ఎదుటే ఇరువర్గాల ఘర్షణ



ఇరువర్గాలను చెదరగొడుతున్న ఎస్సై

**వైరా:** వివాహేతర సంబంధం విషయమై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఇరువర్గాలు పోలీసుస్టేషన్ ఎదుటే ఘర్షణ పడిన వైనమిది. వైరా ఇందిరమ్మ కాలనీకి చెందిన నాగలక్ష్మికి రఘునాథపాలెం మండలం చింతగుర్తి వాసి సతీష్‌తో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. ఇటీవల సతీష్ మద్యానికి బానిసై మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని తెలుసుకున్న నాగలక్ష్మి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చింది. అదేసమయాన సతీష్ తరపు బంధువులు కూడా చేరుకోగా.. ఇరువర్గాలు పోలీస్‌స్టేషన్ ఎదుట పరస్పరం దాడి చేసుకున్నారు. దీంతో ఎస్సై వంశీకృష్ణ భాగ్యరాజ్ ఇరువర్గాలను చెదరగొట్టి ఫిర్యాదులు స్వీకరించారు.

## నాటు సారా స్వాధీనం

**జూలూరుపాడు:** మండలంలోని మాచినేనిపేట గ్రామ పంచాయతీ గోపాతండా గ్రామంలో ఓ ఇంటిపై పోలీసులు దాడి చేసి నాటు సారాను స్వాధీనం చేసుకున్న సంఘటన సోమవారం రాత్రి జరిగింది. జూలూరుపాడు ఎస్ఐ బి రాణా ప్రతాప్ తన పోలీస్ సిబ్బందితో కలిసి గోపాతండాలో తనిఖీ చేస్తుండగా బానోత్ మంగి వద్ద ఉన్న సుమారు 6 లీటర్ల నాటు సారాను పట్టుకున్నారు. నాటు సారాను స్వాధీనం చేసుకుని నిందితురాలిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాణా ప్రతాప్ తెలిపారు.

## ఉపాధ్యాయులను కేటాయించాలని ధర్నా

**కూసుమంచి:** పాలేరు ఉన్నత పాఠశాలలో సరిపడా ఉపాధ్యాయులను కేటాయించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులు సోమవారం పాఠశాల ఎదుట ధర్నా చేశారు. ఈసందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలో 115 మంది విద్యార్థులు ఉంటే, బోధనకు ఇద్దరే టీచర్లు ఉండడంతో ఎస్టీజీలతో పాఠాలు చెప్పిస్తున్నారని పేర్కొన్నారు. ఇకనైనా సరిపడా ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈవిషయమై ఎంఈఓ స్పందిస్తూ టీచర్ల కొరత నిజమేనని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

**జైత్రాంతండా పాఠశాల వద్ద...**

**కారేపల్లి:** మండలంలోని జైత్రాంతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 53మంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయురాలు బోధిస్తుండడంతో, మరో టీచర్‌ను నియమించాలంటూ విద్యార్థులు సోమవారం నిరసన తెలిపారు. పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా, ఒకరు బదిలీ అయ్యారు. ఇక ఇందిర అనే ఉపాధ్యాయురాలు మిగలగా, బదిలీ అయిన టీచర్ స్థానంలో సుమన్‌ను కేటాయించినా ఆయన ఉన్నత చదువుల నిమిత్తం సెలవులో వెళ్లారు. ఈమేరకు ఒకే ఉపాధ్యాయురాలు 53మందికి బోధించడం కష్టంగా ఉన్నందున మరో టీచర్‌ను కేటాయించాలని నిరసన తెలిపారు. ఈ విషయమై ఎంఈఓ జయరాజును వివరణ కోరగా సమస్యను డీఈఓ దృష్టికి తీసుకెళ్లగా డిప్యూటేషన్‌పై మరో ఉపాధ్యాయుడిని రెండు రోజుల్లో నియమించనున్నట్లు తెలిపారని వెల్లడించారు.

## సత్తుపల్లి డివిజన్‌లో ఇంటర్ లింక్ లైన్ ఏర్పాటు



నూతన లైన్‌ను చార్జ్ చేసిన ఎస్ఈ సురేందర్, అధికారులు

**ఖమ్మంవ్యవసాయం:** సత్తుపల్లి విద్యుత్ డివిజన్ పరిధిలో కుర్నవల్లి – గరికపాడు సబ్ స్టేషన్ల మధ్య ఇంటర్ లింకింగ్ విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. 10.5 కిలోమీటర్ల పొడవుతో 33 కేవీ సామర్థ్యం కలిగిన ఈ లైన్‌ను రూ.70 లక్షల ఖర్చుతో నిర్మించారు. ఈ లైన్ ద్వారా కుర్నవల్లి, పెద్దకోరుకొండి, గరికపాడు సబ్‌స్టేషన్ల పరిధి 60 గ్రామాలకు నిరంతర విద్యుత్ సరఫరాకు అవకాశం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు. కాగా, నూతన లైన్‌ను ఎస్ఈ ఏ.సురేందర్, డీఈ ఎల్.రాములునాయక్, ఏడీఈలు ఖాదర్‌బాబా, రామకృష్ణ, కుర్నవల్లి, ఏఈ సుందర్ కుమార్ సోమవారం టెక్నికల్ చార్జ్ చేశారు.

## కారు దగ్ధం : ఇద్దరికి తీవ్రగాయాలు



బాధితుడిని కొత్తగూడెం తరలిస్తున్న కార్మిక నాయకులు

**మణుగూరు టౌన్:** ప్రమాదవశాత్తు కారు దగ్ధమైన సంఘటన మణుగూరులోని ముత్యాలమ్మనగర్ వద్ద సోమవారం జరిగింది. ఓసీ–2లోని ఎస్అండ్‌డీ విభాగంలో మోటార్‌వెహికల్ డ్రైవర్‌గా పనిచేస్తున్న పి.రామ్మోహన్ తన భార్య జ్యోత్స్నా రాణితో కలిసి కారులో మణుగూరు నుంచి పీవీకాలనీ వెళ్తున్నాడు. ఈ క్రమంలో ముత్యాలమ్మనగర్ సమీపంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించి కారు దగ్ధమైంది. కారులో ఉన్న ఇద్దరికీ తీవ్రగాయాలు కావడంతో స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. గాయపడ్డ వారిని సింగరేణి ప్రాంతీయ వైద్యశాలకు, అక్కడి నుంచి కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. స్థానికుల సమాచారంతో వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం సంభవించిందా లేక షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందా? అనేది తెలియరాలేదు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ రంజిత్ పరిశీలించి వివరాలు సేకరించారు. కాగా తీవ్ర గాయాలపాలైన రామ్మోహన్‌ను ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి వై. రాంగోపాల్, ఆదిత్య, సుదీప్, ఐఎన్‌టీయూసీ నాయకులు ఊకంటి ప్రభాకర్‌రావు పరామర్శించారు.

## ఖమ్మం జిల్లాలో ముగ్గురు సీఐల బదిలీ

**ఖమ్మంక్రైం:** జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్లలో విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రఘునాథపాలెం సీఐ తుమ్మలపల్లి శ్రీహరిని ఖమ్మం మహిళా పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేయగా ఆయన స్థానంలో వరంగల్ కమిషనరేట్ నుంచి ఎండీ.ఉస్మాన్ షరీఫ్‌ను కేటాయించారు. ఇక వీఆర్‌లో ఉన్న బరపాటి రమేష్‌ను ఐజీ కార్యాలయానికి కేటాయించి, రామగుండం పోలీస్ కమిషనరేట్ నుంచి ముత్తిలింగయ్యను సత్తుపల్లి రూరల్ సీఐగా బదిలీ చేశారు. అలాగే, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ వేణును ములుగు ఎస్‌బీ సీఐగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి.

## అదుపుతప్పి కారు బోల్తా



కారులోని వ్యక్తులను బయటకు తీస్తున్న స్థానికులు

**కారేపల్లి:** అదుపుతప్పి కారు బోల్తా కొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. భద్రాద్రి జిల్లా హేమచంద్రపురం గ్రామానికి చెందిన ఇద్దరు కారులో ఖమ్మం నుంచి ఇల్లెందు మీదుగా సోమవారం హేమచంద్రపురం వెళ్తున్నారు. ఖమ్మం – ఇల్లెందు ప్రధాన రహదారి శాంతినగర్ ఓసీ మూలమలుపు వద్ద కారు అదుపు తప్పి రోడ్డు దిగువ కల్వర్టులోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఒకరి తలకు తీవ్రగాయం కాగా, మరో వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్థానికులు వీరిని బయటకు తీసి, ద్విచక్రవాహనంపై ఇల్లెందు ఆస్పత్రికి తరలించారు. కాగా, క్షతగాత్రుల వివరాలు తెలియరాలేదు.

## చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలుశిక్ష

**ఖమ్మం లీగల్:** తీసుకున్న అప్పు కింద చెల్లని చెక్కు కేసులో నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయమూర్తి బిక్కం రజని సోమవారం తీర్పు చెప్పారు. ఈ తీర్పు వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం లెనిన్‌నగర్‌కు చెందిన సయ్యద్ యూసఫ్ అలీ కవిరాజ్ నగర్‌కు చెందిన చెన్నూరి రాజ్యలక్ష్మి వద్ద 2016లో రూ.10లక్షల అప్పు తీసుకున్నాడు. బాకీ చెల్లించే క్రమాన 2017 అక్టోబర్‌లో చెక్కు ఇవ్వగా ఖాతాలో సరిపడా నగదు లేక చెక్కు తిరస్కరణకు గురైంది. దీంతో రాజ్యలక్ష్మి తన న్యాయవాది ఎం.శ్రీనివాసరావు ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. కేసును పరిశీలించిన న్యాయమూర్తి రూ.10లక్షలు తిరిగి చెల్లించాలని ఆదేశించడంతో పాటు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.